క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ..11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 28, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 23, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 65, గోకరకాయ 25, కీర 16, దోసకాయ 15, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

హెల్త్ కేర్ కోర్సుల ప్రవేశాలకు కసరత్తు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో గతంలో కొనసాగిన పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల్లో ప్రవేశాలకు కసరత్తును ప్రారంభమైంది. డిగ్రీ అర్హతతో 14 పీజీ డిప్లొమా కోర్సులను గతంలో ప్రతి ఏటా విజయవంతంగా నిర్వహించారు. కరోనా కారణంగా నాటి నుంచి నేటి వరకు ప్రవేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కోర్సు పూర్తికాగానే దేశ, విదేశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విరివిగా ఉన్న హెల్త్‌కేర్ కోర్సులను పునరుద్ధరించి ప్రవేశాలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

సెంట్రల్ వర్సిటీకి సమ్మక్క-సారలమ్మ పేరు హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: ములుగులో ప్రారంభమయ్యే సెంట్రల్ యూనివర్సిటీకి ఆదివాసీల ఆరాధ్య దైవం సమ్మక్క–సారలమ్మ నామకరణం ప్రకటించడం పట్ల ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ట్రైబల్ యూనివర్సిటీకి రూ.900 కోట్లు కేటాయించడం ఏబీవీపీ విజయంగా అభివర్ణించారు. ట్రైబల్ వర్సిటీ స్థాపనతో ఉన్నత విద్య వ్యాప్తితో పాటు ఎస్టీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి త్వరగా ట్రైబల్ వర్సిటీ స్థాపనకు కృషి చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గంలో ఓయూ విద్యార్థికి చోటు



నరేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ కార్యవర్గంలో ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి జి.నరేష్‌కు చోటు లభించింది. ఇటీవల బిహార్‌లో జరిగిన 30వ జాతీయ మహాసభల్లో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. గతంలో వివిధ పదవులు చేపట్టిన ఆయన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన నరేష్ ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

తార్నాక బస్తీ దవాఖానాలో వైద్య సేవలు షురూ



లాలాపేట: తార్నాక డివిజన్ నాగార్జున నగర్ కాలనీ వాసుల కోసం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలో నేటి నుంచి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైశాలి అపార్టుమెంట్ పక్కన గతంలో నిర్మాణం చేసిన మహిళా భవన్‌లో ఈ బస్తీ దవాఖానా, ఆయుష్మాన్ భారత్(హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్) అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఓ డాక్టర్‌తో పాటు ఓ నర్సు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు కొనసాగుతాయి.

మాజీ ప్రజా ప్రతినిధులకు పెన్షన్ అమలు చేయాలి

ముషీరాబాద్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల మాజీ ప్రతినిధులకు పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధుల సమస్యలు పరిష్కరించాలని ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఒక్కరోజు దీక్షను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ ప్రజాప్రతినిధులకు హెల్త్ కార్డులు, ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఐదేళ్లు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా గ్రామంలో సేవలందించిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లలో తొలి ప్రాధాన్యత అందించి, ఖాళీ ఇంటి స్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలన్నారు. మాజీ ప్రజాప్రతినిధుల రాష్ట్ర కార్యాలయానికి హైదరాబాద్‌లో భవన నిర్మాణ స్థలంతో పాటు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



శాంతినగర్‌లో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కార్తీకరెడ్డి



సనత్‌నగర్‌లో గాంధీజీకి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



సనత్‌నగర్ శివాజీనగర్‌లో బాపూజీకి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

మహాత్ముడికి ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీజీ చిత్రపటాలు ఏర్పాటు చేసిన ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..మహాత్ముని బోధనలు అందరూ అనుసరించాలన్నారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



నివాళులర్పించిన జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, మంత్రి తలసాని



మహాత్ముని విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాంధీ ఆస్పత్రి పాలన యంత్రాంగం, అధికారులు, వైద్యులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణమోహన్



మహాత్ముని విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్, సీఐటీయు నాయకులు



చిలకలగూడలో గాంధీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కార్పొరేటర్ సామల హేమ



మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగులూరి సాయిబాబా



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ ప్రకాశ్ జవ్‌దేవ్‌కర్, మర్రి శశిధర్‌రెడ్డి నివాళి



తిరుమలగిరిలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన శ్రీ గణేష్



రసూల్‌పురా గన్‌బజార్‌లో నివాళి అర్పిస్తున్న జంపన ప్రతాప్, తదితరులు



గాంధీజీకి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన పవన్‌కుమార్‌గౌడ్, తదితరులు



టీఎస్‌పీసీబీ కార్యాలయంలో..



తిరుమలగిరిలో ..



జెక్‌కాలనీ గాంధీ విగ్రహం వద్ద..

వంజరులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వంజరి సంఘం నేతలు

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వంజరి కులస్తులకు జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే సీట్లు కేటాయించి రాజకీయంగా సముచితమైన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర వంజరి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తార్నాకలోని వంజరి భవన్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు, రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీసీ బంధును వంజరి సామాజిక వర్గానికి వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం అభివృద్ధికి అందరూ పాటుపడాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, సాల్వేరు ముత్తయ్య, కరిపె ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

2 గంటల పాటు పియానో కీబోర్డు వాయిస్తూ..

ఇంటర్నేషనల్ స్టార్ బుక్‌లో చోటు



సర్టిఫికెట్లు అందుకున్న కళాకారులు

లాలాపేట: రెండు గంటల పాటు ఏకధాటిగా పియానో కీబోర్డు ప్లే చేస్తూ పాటలు పాడుతూ 120 మంది కళాకారులు ఇంటర్నేషనల్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమం సోమవారం తార్నాకలోని మర్రి కృష్ణా ఫంక్షన్ హాల్లో జరిగింది. యేషువా బేత్ హలెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ అగస్టీన్ దండిగి గత కొంతకాలంగా ఆన్‌లైన్‌లో ఉచితంగా కీబోర్డు వాయించడంపై శిక్షణ అందించారు. శిక్షణ పొందిన 120 మందిని ఎంపిక చేశారు. వారి ప్రతిభను పరీక్షించేందుకు ఇంటర్నేషనల్ స్టార్ బుక్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. ప్రతిభ కనబరచిన కళాకారులకు ఇంటర్నేషనల్ స్టార్ బుక్ రికార్డు ఫౌండర్ చైర్మన్ డా.అరవింద్ కుమార్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ ప్రిన్సిపాల్ హెబ్సిబా గ్రేస్, ఎజ్రాశాస్త్రీ, స్నేహలత పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన టీకె సూర్యప్రకాశ్‌రావు(65) జీఎస్‌టీయూ రిటైర్డ్ ఉద్యోగి. ఈ నెల 1న విశాఖపట్నం వెళ్లేందుకు తన భార్యతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలులో ప్రయాణిస్తున్న క్రమంలో హఠాత్తుగా అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలి

కాచిగూడ: మహిళా రిజర్వేషన్ అమలులో జాప్యం చేస్తే మహిళా ఐక్య ప్రతిఘటన తప్పదని జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నేదునూరి జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం నారాయణగూడ గాంధీకుటీర్‌లో గాంధీ విగ్రహం వద్ద మహిళలు 'డిమాండ్ డే'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్, జనగణన పేరుతో కేంద్రం జాప్యం చేయడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. తెలంగాణ శ్రామిక ఫోరం కన్వీనర్ ప్రేమ్ పావని, ఎస్.చాయాదేవి, నళిని, షహనా అంజుమ్ తదితరులున్నారు.

ఘనంగా వీడ్కోలు

దక్షిణమధ్య రైల్వే ఎస్ అండ్ టీ వర్క్‌షాపులో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తించి రిటైర్ పదవీ విరమణ టీ.రామస్వామికి వర్క్‌షాపు సిబ్బంది, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. –సాక్షి, సిటీబ్యూరో



సమస్యల పరిష్కారానికి పెద్దపీట



పనులు ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

అమీర్‌పేట: సాధారణ సమస్యలతో పాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేటలో రూ.3.70 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఆయన పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిక్‌వాడలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని నేచర్‌క్యూర్ ఆసుపత్రి వద్ద అక్రమ పార్కింగ్‌ను నిలువరించాలని, వీధి దీపాలకు మరమ్మత్తులు చేపట్టాని ఆదేశించారు. రేణుకానగర్‌లో నివాసాల మధ్యలో ఉన్న గ్యాస్ గోడౌన్‌ను తరలించాలని మహిళలు కోరగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. బౌద్ధనగర్ వాసులకు కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.అనారోగ్యానికి గురైన సీనియర్ సిటిజన్ సభ్యులు, రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్‌సీ కుమార్ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డీసీ జగన్, ఇందిర, హరిశంకర్, వంశీ, భార్గవ్, ఫయీం , హనుమంత్‌రావు, లలితాచౌహాన్, అశోక్‌యాదవ్, నర్సింహా, సంతోష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి సూచించారు. అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు డెంగీ, మలేరియా, ఇతర జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ.. ప్రస్తుతం డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పుడే వ్యాధులను పూర్తిస్థాయిలో అరికట్టగలుగుతామన్నారు. నేటి నుంచి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి జ్వరం సర్వే చేపడుతున్నామని ప్రజలందరూ ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి శంకర్, బీఆర్‌ఎస్ నేత లింగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం, నిజాయితీతోనే గుర్తింపు



పురస్కారం అందుకుంటున్న కరుణాకర్‌రెడ్డి

సనత్‌నగర్: అంకితభావం, కార్యదక్షత, నిజాయితీతోనే సమాజంలో గుర్తింపు లభిస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. రాజారత్న గ్రూప్, ట్యూటర్స్ ప్రైడ్ సంస్థల ఆధ్వర్యంలో బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో నిష్ణాతులకు ఐడియల్ టీచింగ్ అవార్డ్స్ ప్రోగ్రాం–2023 (ఐటీఏపీ) పురస్కారాలను సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఇదే వేదికపై కాళోజీ వైద్య విద్యా విశ్వవిద్యాలయం ఉపకులపతి కరుణాకర్‌రెడ్డికి మహా మహోపాధ్యాయ పురస్కారం, నిమ్స్ డైరెక్టర్ బీరప్పకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. రాజారత్న విద్యా సంస్థల పురస్కారాలకు సమాజంలో మంచి గుర్తింపు ఉందన్నారు. సరైన వ్యక్తులకు ఈ అవార్డులను ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. సమాజ వికాసానికి పాటుపడుతున్న వారి సేవలను గుర్తించి వారిని సత్కరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ రంగంలోనైనా నిబద్ధతతో పనిచేసుకుంటూ వెళ్తే గుర్తింపు లభిస్తుందన్నారు.గురువుగా పాఠాలు బోధించినప్పుడు తాను పొందిన అనుభూతి గొప్పదన్నారు. బీరప్ప మాట్లాడుతూ.. దేశంలో ప్రతిభావంతులకు కొదువ లేదని సీఎం కేసీఆర్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన దేశంలో ఎక్కడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, మాజీ మంత్రి బాబూమోహన్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వెంకట్‌రావు, డాక్టర్ వెంకట సత్యనారాయణ, విల్సన్, నందకుమార్‌రెడ్డి, అక్షయపాత్ర శ్రీనివాస్, రవీంద్ర, కృష్ణారావు, వకుళావ్యాస్, చేబ్రోలు శశిబాల పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న డాక్టర్ వెంకటి



రక్తదానం చేస్తున్న డీఐజీ సుమతి

రాంగోపాల్‌పేట్: రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. సోమవారం ప్యాట్నీ సెంటర్‌లోని డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశ్రితా రెడ్డి, డాక్టర్ ఖలీల్, డాక్టర్ గిరిజా, వెంకటేశ్వరు, శ్రీనివాసరావు, నిరంజన్, రాజ్యలక్ష్మి, గీతా తదితరులు పాల్గొన్నారు.

- మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ సుమతి హాజరై రక్తదానం చేశారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మక్తల ఫౌండేషన్ వ్యవస్థాకుడు జలంధర్‌గౌడ్‌ను ఆమె అభినందించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్న వారికి ప్రాణం పోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవీందర్, మహంకాళి ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లు ఉప శంకర్, పరశురాం పాల్గొన్నారు.

15 నుంచి దాండియా ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రసూల్‌పురా: దసరా నవరాత్రులను పురస్కరించుకుని సెలబ్రిటీ హుడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో దాండియా రాస్ ఉత్సవ్ పేరుతో కంటోన్మెంట్ ఇంపీరియల్ గార్డెన్‌లో దాండియా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రషీద్ తెలిపారు. సోమవారం ఇంపీరియల్ గార్డెన్‌లో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు జి. అనిల్‌కుమార్ యాదవ్ దాండియా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 23 వరకు దాండియా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ యేడాది ప్రత్యేకంగా కుటుంబ సమేతంగా వచ్చే వారికి ఆఫర్లను ఇస్తున్నామని అదే విధంగా వంద మంది గుజరాతీలకు ఉచితంగా దాండియా ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రాంతాలకు అతీతంగా దాండియా సంస్కృతి హైదరాబాద్ వ్యాప్తంగా వ్యాపించినట్లు తెలిపారు. దాండియా ఉత్సవాలకు హైదరాబాద్ ప్రత్యేక కేంద్రంగా నిలిచిందన్నారు. అనంతరం గుజరాతి వేషధారణలో యువతి యువకుల దాండియా నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మనికాంత్ గౌడ్, గోకుల్ యాదవ్, రాజేష్ షా కౌశల్, హితేశ్ సునీత పటేల్, మేఘ బ్యాంకర్, జ్యోతి, కవిత పాల్గొన్నారు.